
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
నాగర్‌కర్నూల్ జిల్లా వార్తలు
మంగళవారం 30 సెప్టెంబరు 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 27.0 । కనిష్ఠం : 22.0



ఉత్సాహంగా పూల పండగ

- అచ్చంపేటలో ఘనంగా బతుకమ్మ సంబురాలు
- ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు



అచ్చంపేట ఐలవ్ గ్రౌండ్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు 6

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

- డీఎస్పీ మొగులయ్య 7

నేడు దుర్గాష్టమి వేడుకలు

- నారాయణపేట జిల్లాలో ప్రత్యేకం
- అమ్మవార్లకు పొట్టేళ్లను సమర్పించనున్న భక్తులు



నారాయణపేటలో అమీన్‌ఘడ్ నుంచి దిగుమతి చేసుకున్న పొట్టేలు 7

ముహూర్తాలు ఖరారు

రెండు విడతల్లో పరిషత్‌లకు, మూడు విడతల్లో పంచాయతీలకు ఎన్నికలు



నవాబ్‌పేట మండలం కూచూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

- మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు.. అక్టోబరు 9న ఎన్నికల నోటిఫికేషన్
- షెడ్యూల్ విడుదల చేసిన ఎస్ఈసీ..
- ఉమ్మడి జిల్లాలో 77 జడ్పీటీసీ, 800 ఎంపీటీసీ, 1,678 సర్పంచు స్థానాలు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఒక కీలక ముందడుగు పడింది. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కావడం, కోర్టు కూడా ఎన్నికల నిర్వహణపై ఎలాంటి స్టే విధించకపోవడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం నగారా మోగించింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు, సర్పంచుల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. వెంటనే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చింది. ఎంపీటీసీ ఎన్నికలను రెండు విడతలుగా.. సర్పంచు ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహించనున్నారు. ముందుగా

(మిగతా 6లో..)

ఉమ్మడి జిల్లాలో విడతల వారీగా ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు జరిగే ఎన్నికల వివరాలు

జిల్లా	ఎంపీటీసీ స్థానాలు	జడ్పీటీసీ స్థానాలు	మొదటి విడత	రెండో విడత
మహబూబ్‌నగర్	175	16	8 జడ్పీటీసీ, 89 ఎంపీటీసీ స్థానాలు (బాలానగర్, భూత్పూరు, గండీడ్, మహమ్మదాబాద్, జడ్చర్ల, మిడ్జిల్ నవాబ్‌పేట, రాజాపూర్)	8 జడ్పీటీసీ, 86 ఎంపీటీసీ స్థానాలు (అడ్డాకుల, సీసీకుంట, దేవరకద్ర, హన్వాడ కోయిల్‌కొండ, మహబూబ్‌నగర్ రూరల్, కౌకుంట్ల, మూసాపేట)
జోగులాంబ గద్వాల	142	13	5 జడ్పీటీసీ, 69ఎంపీటీసీ స్థానాలు (గద్వాల, గట్టు, ధరూర్, కేటీదొడ్డి, మల్దకల్)	8 జడ్పీటీసీలు, 73 ఎంపీటీసీ స్థానాలు (అలంపూర్, ఉండవెల్లి, వడ్డేపల్లి, రాజోలి అయిజ, మనవపాడు, ఇటిక్యాల, ఎర్రవల్లి)
నారాయణపేట	136	13	8 జడ్పీటీసీ, 82 ఎంపీటీసీ స్థానాలు (కోస్గి, మద్దూరు, కొత్తపల్లి, గుండుమాల్ దామరగిద్ద, నారాయణపేట, ధన్వాడ, మరికల్	5 జడ్పీటీసీ, 54 ఎంపీటీసీ స్థానాలు (ఊట్కూరు,మాగనూరు, మక్తల్, కృష్ణా, నర్వ)
నాగర్‌కర్నూల్	214	20	9 జడ్పీటీసీ, 109 ఎంపీటీసీ స్థానాలు (బిజినేపల్లి, నాగర్‌కర్నూల్, తిమ్మాజిపేట, తాడూరు, తెలకపల్లి, కల్వకుర్తి, ఊర్కొండ, వెల్దండ, వంగూరు)	11 జడ్పీటీసీ, 105 ఎంపీటీసీ స్థానాలు (అచ్చంపేట, అమ్రాబాద్, బల్మూరు, లింగాల, పదర, ఉప్పునుంతల, చారకొండ, కొల్లాపూర్, పెంట్లవెల్లి, కోడేరు, పెద్దకొత్తపల్లి)
వనపర్తి	133	15	8 జడ్పీటీసీ, 71 ఎంపీటీసీ స్థానాలు (వనపర్తి, గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల, పెద్దమందడి, ఖిల్లాఘణపూర్, పెబ్బేరు శ్రీరంగాపూర్)	7 జడ్పీటీసీ, 62 ఎంపీటీసీ స్థానాలు (కొత్తకోట, మదనాపూర్, ఆత్మకూరు, అమరచింత, పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి)

విద్యాభివృద్ధికి కృషి

- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో గద్వాల డీఈఓ విజయలక్ష్మి



గద్వాల సర్కిల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా విద్యాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని డీఈఓ విజయలక్ష్మి అన్నారు. నిర్మల్ డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మి డీఈఓగా బదిలీపై గద్వాలకు వచ్చారు. సోమవారం తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టిన ఆమె 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

విద్యాభివృద్ధికి మీరు చేపట్టే కార్యాచరణ ఎలా ఉంది?

జిల్లాలోని అన్ని పాఠశాలలను పరిశీలిస్తా. అక్కడి ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుసుకోవడంతో పాటు పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకుంటా. జిల్లాను విద్యాపరంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఎంఈవో, హెచ్ఎం, ఉపాధ్యాయులతో సమీక్షలు నిర్వహించేలా కార్యాచరణ ఉంది. కలెక్టర్, అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో అందరి సమన్వయంతో విద్యాభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తా..

విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో వారికి తెలియని ప్రతిభ ఉంటుంది. అలాంటి ప్రతిభను వెలికి తీసేందుకు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించి నవీకరణ బోధన చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. ఉపాధ్యాయులు విద్యార్థుల ఆసక్తిని గమనించి టీఎల్ఎంలను ఆపాదిస్తూ సులభ తరహాలో పాఠ్యాంశాలను బోధించేందుకు కృషి చేస్తాం. సాంకేతికతలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యా ప్రణాళికను అమలు చేయిస్తాం.

జిల్లాలో విద్యా సమస్యలపై ఎలా స్పందిస్తారు?

తప్పకుండా జిల్లాలోని పాఠశాలల పరిస్థితి, విద్యా సమస్యలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యక్షంగా వెళ్లి తెలుసుకుంటాను. సమస్య స్థాయిలో ఉన్న కలెక్టర్, అదనపు కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తాను.

ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా..?

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి. ఇతరులకు ఆదర్శంగా ఉండేలా ఉపాధ్యాయులు నడుచుకోవాలి. విద్యార్థులు కూడా ప్రార్థనా సమయానికి తప్పకుండా వచ్చేలా చర్యలు తీసుకుంటాం. ప్రతీ విద్యార్థి ఏకరూప దుస్తులతో పాఠశాలలకు వచ్చేలా అవగాహన కల్పిస్తాం.

పదో తరగతి ఫలితాలపై మీ ప్రణాళిక ఎలా ఉంటుంది?

ఈ ఏడాది వెలువడిన పదోతరగతి ఫలితాలు జోగుళాంబ గద్వాల జిల్లా 10 శాతం పైగానే వృద్ధిరేటు సాధించింది. వచ్చే ఏడాది మార్చి/ఏప్రిల్‌లో జరిగే పది పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా కృషి చేస్తాం. ప్రత్యేక తరగతులతో పాటు ప్రేరణ తరగతులు నిర్వహించి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా సన్నద్ధం చేస్తాం.. వెనకబడిన విద్యార్థులను గుర్తించి పూర్తిస్థాయిలో ఉత్తీర్ణత సాధించేలా వారిలో విశ్వాసం నింపుతాం. ఈ మేరకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించి ముందుకెళ్తాం.. ఉత్తమ ఫలితాలతో జిల్లాను రాష్ట్రంలో మెరుగైన స్థానంలో నిలబెడుతాం.



పెరిగిన వరద..

నీట మునిగిన పంటలు

- పరిహారం అందకముందే రైతులకు తీవ్ర నష్టం
- నిధుల విడుదలలో జెన్‌కో జాప్యం

నీట మునిగిన తోట, పంట పొలాలు 7



కొల్లాపూర్‌లో కవాతు నిర్వహిస్తున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకర్తలు

విశ్వ గురువుగా భారతదేశం

- పాలమూరు సంఘ చాలక్ ఎమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి
- ఘనంగా ఆర్ఎస్ఎస్ శత వసంతాల ఉత్సవం 6

ఐదోశక్తి పీఠానికి పూర్వవైభవం

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

అలంపూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఐదో శక్తిపీఠం అలంపూర్ జోగుళాంబదేవి, బాల బ్రహ్మేశ్వరస్వామి వార్ల ఆలయాలకు పూర్వ వైభవాన్ని తీసుకువస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌కు వచ్చిన ఆమె రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ దీప్తి, ఆలయ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్తలు, అర్చకులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రికి తీర్థప్రసాదాలను అందజేశారు. గద్వాల సంస్థాన వారసులు పౌండర్ ట్రస్టు ద్వారా ఆలయాలపై శ్రద్ధ పెట్టడం సంతోషమని, ఇకపైన పర్మినెంట్ ట్రస్టుగా ఏర్పాటు



అలంపూర్‌లో జోగుళాంబదేవికి పట్టువస్త్రాలను తీసుకువస్తున్న మంత్రి కొండా సురేఖ

చేసినా తరతరాలుగా వారే ట్రస్టీలుగా కొనసాగే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆలయాల అభివృద్ధిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుగుతుందని, ఆలయాల కమిటీ పూర్తయిన తర్వాత కొత్త కమిటీని నియమిస్తామని, ఆలయాల అభివృద్ధి కోసం రూ. 33 కోట్లతో ప్రణాళిక చేశామని, మూడు విడతల్లో ఆలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎండోమెంటు ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, ఎమ్మెల్యే విజయుడు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, గద్వాల సంస్థాన వారసుడు కృష్ణరాంభూపాల్, ధర్మకర్తలు తదితరులు ఉన్నారు.

కనీసం 9 వేల ఎకరాలకు నీరిచ్చినట్లు నిరూపిస్తే

రాజీనామాకు సిద్ధం

- కేటీఆర్‌కు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సవాల్
- పదేళ్ల పాలనలో ఎగవేసిన బాకీ కార్డులు మేమే పంచుతాం
- పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది బీఆర్ఎస్



అచ్చంపేటలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పాలనలో అచ్చంపేట నియోజకవర్గంలోని 90 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ అచ్చంపేట సభలో ప్రకటించడం విడ్డూరంగా ఉన్నదని, కనీసం 9 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చినట్లు నిరూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కేటీఆర్‌కు సవాల్ చేశారు. సోమవారం నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో, అచ్చంపేటలో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు పాతాళానికి తొక్కిపెట్టారన్నారు. రెండు సంవత్సరాల తమ పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ గుట్టనక్క అని కేటీఆర్ అనడం విడ్డూరమని, కేసీఆర్, కేటీఆరే గుట్టనక్కలని, రేవంత్ నల్లమల పులి అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రజలకు 24గంటలూ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కారం చేస్తున్నారని, ఫాంహౌజ్ పాలన నుంచి రాష్ట్రం ప్రజాపాలనలో అభివృద్ధి పథంలో నడుస్తోందని అన్నారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదన్నారు. గతంలో అనాటి ఏపీ ముఖ్యమంత్రి జగన్‌తో కలిసి మాజీ మంత్రి రోజా ఇంట్లో తిని రాయలసీమను రతనాల సీమను చేస్తానని హామీ ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. కేఎంబీఆర్ మూడుసార్లు సమావేశం ఏర్పాటు చేస్తే ఎందుకు హాజరుకాలేదో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా 2 నెలల్లో ఉమామహేశ్వర ప్రాజెక్టును ప్రారంభిస్తామని, ఇప్పటికే రూ. 690 కోట్లు మంజూరు అయ్యావని తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, కాంగ్రెస్ నాయకులు మల్లేష్, లక్ష్మీనరసింహాస్వామి, గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఎన్నికల కోడ్

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. జిల్లాలో ఎలాంటి కార్యక్రమాలకు అనుమతి లేదని, ఎన్నికల నియామవళిని కఠినంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం అధికారికంగా షెడ్యూల్ విడుదల చేసిందని, దీంతో పాటు జిల్లా వ్యాప్తంగా తక్షణమే కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కోడ్ కొనసాగుతుందన్నారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అధికార యంత్రాంగం ఇప్పుడు ఎన్నికల కమీషన్ పరిధిలో పని చేయాల్సి ఉంటుందన్నారు. ప్రజలకు అందించే సేవలు మాత్రం ఆగకూడదని, కానీ అవిరాజకీయ ముద్ర లేకుండా పూర్తిగా నిస్పాక్షికంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.



మట్టి పరిమళానికి మరో పురస్కారం

- 'పల్లె కన్నీరు' పాటతో అమితమైన జనాదరణ
- డర్బన్ సదస్సుతో ఖండాంతర ఖ్యాతి
- గౌరవ డాక్టరేట్ ప్రకటించిన అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ
- నేడు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ప్రదానం 6

రైతులు ఆందోళన చెందొద్దు

- రెండు, మూడు రోజుల్లో సరిపోయినంత యూరియా
- ఉమ్మడి పాలమూరు డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

పాన్‌గల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా పాన్‌గల్ రైతు వేదికలో నిర్వహించిన సింగిల్ విండో మహాజనసభ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వాల్సినంత యూరియా ఇవ్వకపోవడంతోనే రైతులకు కొరత ఏర్పడిందని అన్నారు. మరో రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో రైతులకు కావలసినంత యూరియా సరఫరా చేస్తామని తెలిపారు. సింగిల్ విండో ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలను పంపిణీ చేస్తున్నామని, సింగిల్ విండో సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సింగిల్ విండో ద్వారా రైతులకు వ్యవసాయ రుణాలతో పాటు వ్యవసాయ యంత్రాలు రుణాలను కూడా ఇస్తున్నామని తెలిపారు. రైతులు రుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్, విండో వైస్ చైర్మన్ బాలయ్య, విండో డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తి పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి సరస్వతి దేవి అలంకరణలో వాసవిమాత



అలంపూర్‌లో మూలనక్షత్ర అలంకరణలో అమ్మవారు



కొత్తకోటలోని భవానీ శంకర ఆలయంలో సరస్వతీదేవిగా దర్శనం ఇచ్చిన అంబాభవాని



అచ్చంపేట కన్యకా పరమేశ్వరి ఆలయంలో సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



జడ్చర్ల వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సరస్వతీ దేవి అలంకరణలో అవతారంతో పూజలందుకున్న దుర్గామాత



నారాయణపేట అశోక్‌నగర్‌లోని మాలాంబికా దేవి ఆలయంలో సరస్వతీ దేవిగా అమ్మవారు

సరస్వతీ నమస్తుభ్యం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రధాన దేవాలయాల్లో అమ్మవారు 8వ రోజు జ్ఞాన సరస్వతీ దేవిగా భక్తుల పూజలందుకున్నారు. అలంపూర్ క్షేత్రంలో జోగులాంబ అమ్మవారు మహాగౌరీదేవిగా దర్శనమిచ్చారు..

పీఎం సహాయ నిధికి రూ.లక్ష విరాళం



డీడీ ఇస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు లక్ష్మీకాంతరెడ్డి

గద్వాల న్యూటౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సామాజిక బా ధ్యతగా ప్రధానమంత్రి సహాయనిధికి రూ.లక్ష విరాళం అందజేయడం అభినందనీయమని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో వడ్డేపల్లి మండలం కోయిలదిన్నె గ్రామానికి చెందిన రైతు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు గోరంట్ల లక్ష్మీకాంతరెడ్డి పీ ఎం సహాయనిధికి రూ. లక్ష విరాళంగా డీడీ రూపంలో అదనపు కలెక్టర్‌కు అందజేసారు. ఈ యన గతంలో కూడా తనకు రైతు భరోసా ద్వా రా వచ్చిన డబ్బులను పలుమార్లు సీఎం సహాయనిధికి ఇచ్చినట్లు పేర్కొన్నారు. రెండు నెలలుగా దేశంలోని పలు రాష్ట్రాల్లో వరదలతో తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టినందుకు తన వంతుగా సహకారం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పెబ్బేరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పెబ్బేరు పట్టణానికి సమీపంలోని తెలంగాణ మోడల్ స్కూల్ వద్ద సోమవారం జాతీయ రహదారిపై వ్యక్తి తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఏటిగడ్డ శాఖాపూర్‌కి చెందిన కంకలి రేనయ్య కూమారుడు శివశంకర్ గొర్రెలకు మందులు తీసుకునేందుకు బైక్‌పై పెబ్బేరుకు వెళ్తున్నాడు.

హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు వెళ్తున్న బస్సు ద్విచక్ర వాహనాన్ని ఓ వర్‌టెక్ చేసి అకస్మాతుగా ఆపడంతో వెనుకాల వస్తున్న ద్విచక్ర వాహనం బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో కంకలి రేనయ్యకు తలకు, మొఖానికి తీవ్ర గాయాలయ్యాయి. మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా... వైద్యుల సూచ న మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు బాధితులు తెలిపారు. ఈ సంఘటనపై ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై బాధితులు ఫిర్యాదు ఇచ్చినట్లు సమాచారం.

అడుగుకో గుంత

» అధ్వానంగా రాజోలి ప్రధాన రహదారి



రహదారిపైనున్న భారీ గుంతలో నిలిచిన వర్షపు నీరు

వడ్డేపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి నుంచి వడ్డేపల్లి మీదుగా శాంతినగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. రహదారి పూర్తిగా దెబ్బతిని, అడుగుకో గుంత పడింది. వాటిలో వర్షపు నీరు చేరి బురదమయమైంది. దీంతో వాహనదారులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌ల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. రాజోలి మండలానికి చెందిన రైతులు తమ పంట ఉత్పత్తులను గద్వాల, కర్నూలు, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాలకు తరలిస్తుంటారు. రహదారి బాగాలేకపోవడంతో ధాన్యం తరలింపు ఇబ్బందికరంగా మారిందని అంటున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

మట్టి పరిమళానికి మరో పురస్కారం

» 'పల్లె కన్నీరు' పాటతో అమితమైన జనాదరణ
» డర్బన్ సదస్సుతో ఖండాంతర ఖ్యాతి
» వాగ్గేయకారుడు గోరటి వెంకన్నకు గౌరవ డాక్టరేట్
» ప్రకటించిన అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ
» నేడు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ప్రదానం



నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు మట్టి పరిమళం, ప్రజా వాగ్గేయకారుడు, మన గోరటి వెంకన్నకు మరో అరుదైన పురస్కారం లభించింది. తెలంగాణ ప్రజా సాహిత్యంలో ఆయన తనదైన ముద్ర వేసిన ఆయనకు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది.

మంగళవారం ఉదయం 9:30 గంటలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఆయన డాక్టరేట్‌ను అందుకోనున్నారు. ప్రదానోత్సవంలో వైస్ చాన్సలర్ ఘంటా చక్రపాణితో పాటు సీనియర్ ఎడిటర్లు అల్లం నారాయణ, కే.శ్రీనివాస్‌తో పాటు సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొననున్నారు.

సాహిత్య కుటుంబ నేపథ్యం

నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన గోరటి బీరమ్మ, నరసింహ దంప తులకు 1964, ఏప్రిల్ 4న గోరటి వెంకన్న జన్మించారు. యక్షగాన కళాకారుడైన గోరటి నరసింహ స్వయంగా పాటలు రాసి పాడేవారు.

ఆయన వారసత్వాన్ని వెంకన్న అందిపుచ్చుకున్నారు. ప్రకృతి, ప్రజలే ఆయనకు కవితా వస్తువులయ్యాయి. పల్లె జీవనం, సాహితీ సేద్యం ఆయన జీవన విధానంగా మారింది.

ప్రజలు, ప్రకృతి

గోరటి వెంకన్న చిన్నప్పటి నుంచి పంట పొలాలు, వాగులు, వంకలతో సహజీవనం చేశారు. పారే వాగు.. ఏటి తరగలు.. నిండిన చెరువు.. గట్టు మీద నల్ల తుమ్మచెట్టు.. దానిపై గూడు కట్టుకొనే పిట్ట.. ఇలా పల్లె, ప్రకృతి సమస్తం ఆయన కవిత్వంలో, ఆటా పాటల్లో భాగమయ్యాయి. పండుగలు, జనం కష్టాలు, కన్నీళ్లు.. సామ్రాజ్యవాదం అనర్థాలు.. మారిన పల్లె తీరు.. కూలిపోయిన కులవృత్తులు.. ఇలా ప్రకృతి, ప్రజలకు సంబంధించిన ప్రతీ అంశంపై ఆయన కలం కవిత్వం అల్లింది.. పదం పాటై పల్లవించింది. వేదికలపై పాదాలు నర్తించి ఉర్రూతలూగించాయి. ఆయన రాసిన 'పల్లే కన్నీరు పెడుతోందో' పాట అమితమైన జనాదరణ పొందింది. ఈ క్రమంలో గోరటి వెంకన్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి జన జీవితాల్లో మమేకమయ్యారు. సాహిత్యంలో ఆయన చేసిన కృషిని గౌరవిస్తూ గత ప్రభుత్వం శాసన మండలి సభ్యుడిగా అవకాశం కల్పించింది. అయినా రాజకీయాలతో నిమిత్తం లేకుండా ఆయన తన సాహితీ వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారు.

నాటక రంగమంటే అమితమైన ఆసక్తి:

గోరటి వెంకన్న సామాన్యుల జీవితాలపై అధ్యయనం, విశ్లేషణాత్మకమైన దృష్టిని కేంద్రీకరించినప్పటికీ నాటక రంగ పరిరక్షణకు విశేషమైన కృషి చేశారు. ఇప్పటికీ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శిస్తే, నిర్వాహకులు ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానిస్తారు. ఆ నాటకంలో కాటికాపరిగా ఆయన పోషించే పాత్ర విమర్శకుల ప్రశంసలందుకుంటోంది.

రచనలు, పురస్కారాలు

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని దక్కించుకున్న గోరటి వెంకన్న అనేక రచనలు చేశారు. వీటిలో అలసంద్రం వంక, పూసిన పున్నమి, వల్లంకి తాళం తదితర రచనలు బహుళ ప్రాచుర్యాన్ని పొందాయి. ప్రజా వాగ్గేయకారుడిగా ప్రసిద్ధి చెందిన గోరటి వెంకన్న 2022లో భారత ప్రభుత్వం నుంచి సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు. మధ్యప్రదేశ్‌లో కబీర్‌సన్మాన్, హంస పురస్కారాలు, రాష్ట్ర ప్రభుత్వం ఉనంచి ఉగాది పురస్కారంతో పాటు దాదాపు 200 పురస్కారాలను, సాహిత్య అభిమానుల ప్రశంసలను అందుకున్నారు.

మానవ హక్కుల సదస్సులో ప్రసంగం

శ్రమ జీవుల కష్టాలు, సాహిత్యంపై విస్తృతమైన అధ్యయనం చేసిన గోరటి వెంకన్న ఆట, మాట, పాటలతో జనాన్ని చైతన్యపర్చడమే కాకుండా అంతర్జాతీయ వేదికలపై ప్రసంగాలతో అందరినీ ఆకర్షించారు. డర్బన్ వేదికగా మానవ హక్కులపై యునైటెడ్ నేషన్స్ ఆఫ్ ఆర్గనైజేషన్ నిర్వహించిన సెమినార్‌లో ఆయన ప్రసంగం చర్చనీయాంశమైంది. సామాన్యుల జీవితాలపై ఆయన చేసిన సాహిత్య కృషిని గుర్తించి అమెరికా, ఆస్ట్రేలియా, యునైటెడ్ కింగ్‌డమ్, దుబాయ్, సింగపూర్ తదితర దేశాల్లోని సాహితీ సంస్థలు ఆయనను ఆహ్వానించి సత్కరించాయి.

విశ్వ గురువుగా భారతదేశం

» పాలమూరు సంఘ చాలక్ ఎమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి
» ఘనంగా ఆర్ఎస్ఎస్ శత వసంతాల ఉత్సవం



కొల్లాపూర్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100 సంవత్సరాల ఉత్సవాల జెండా ఆవిష్కరణ దృశ్యం



రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఉత్సవాలలో మాట్లాడుతున్న వక్తలు

కొల్లాపూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : భారత దేశాన్ని విశ్వగురువు స్థానంలో నిలబెడదామని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పాలమూరు విభాగ్ సంఘచాలక్ ఎమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి విజయదశమి పర్వదినం నాటికి వంద సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా కొల్లాపూర్ పట్టణంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఇక్కడ 7 రోజులుగా శిక్షణ పొందిన 356 మంది స్వయం సేవకులు పట్టణంలో పథ సంచలన్ నిర్వహించారు. డాక్టర్‌జీ, గురూజీ, భారతమాత చిత్రపటాలతో అలంకరించిన వాహనం వెంట రాగా, దేశభక్తి గీతాలను ఆలపిస్తూ కవాతు కొనసాగించారు. అనంతరం మహబూబ్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఉగాది ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి శశికాంత్ వాల్మీకీ మాట్లాడుతూ సంఘ్ కార్యకర్తలే అసలైన దేశభక్తులు అన్నారు. వ్యక్తి శీలమే జాతి ప్రగతికి మూలమని, వ్యక్తిలో నైతికత పెరగడమే అసలైన దేశాభివృద్ధి అని తెలిపారు. పాలమూరు విభాగ్ సంఘచాలక్ ఎమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో పరివర్తన కోసం 100 సంవత్సరాలుగా దీర్ఘకాలిక లక్ష్యంతో ఆర్ఎస్ఎస్ పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సహ కార్యవాహ ఆగపు నాగయ్య, సీనియర్ నాయకులు ఎల్లేని సుధాకర్‌రావు, కొల్లాపూర్ సంఘ బాధ్యులు, స్వయం సేవకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూల పండగ

» అచ్చంపేటలో ఘనంగా బతుకమ్మ సంబురాలు
» ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు



బతకుమ్మ సంబురాల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు

అచ్చంపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేటలో సోమవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని 'ఐ లవ్ అచ్చంపేట' మైదానంలో నిర్వహించిన ఈ వేడుకలకు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి మహిళా సమాఖ్య సభ్యులు తరలివచ్చారు. తీరొక్క పూలతో తయారు చేసిన బతుకమ్మలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మైదానంలో బతుకమ్మ ఆడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులతో పాటు, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు అంతటి మల్లేశ్, బిజ్జుల రవీందర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల



రెండు గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

దేవరకద్ర, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు కోయిల్‌సాగర్ 2 గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం నాటికి ప్రాజెక్టు నీటి మట్టం 32.2 అడుగులకు చేరింది. ప్రాజెక్టు 2 గేట్ల ద్వారా 2,800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 32.5 అడుగులు కాగా, ప్రస్తుతం 32.2 అడుగులకు చేరింది.

తప్పని పడిగాపులు

» యూరియా కోసం రైతుల అవస్థలు



కమలొద్దీన్‌పూర్ రైతు వేదిక వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం ప్రైవేట్ డీలర్ల వద్ద, పీఏసీఎస్‌ల వద్ద రైతులకు పడిగాపులు తప్పడం లేదు. వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని కమలొద్దీన్‌పూర్ గ్రామంలోని రైతు వేదిక వద్ద సోమవారం యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందిపై ఓ రైతు ఆగ్రహం వ్యక్తం చేశాడు. పంట పాడైన తర్వాత యూరియా ఇస్తారా అంటూ మండి పడ్డాడు. ఈ సమయంలో రైతుల మధ్య స్వల్పంగా తోపులాట జరగడంతో ఏఈవో పవన్‌కళ్యాణ్ చేతికి చిన్న గాయమైంది.

వేతన బడ్జెట్ విడుదల చేయాలి



ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్‌కుమార్‌సింగ్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

నారాయణపేట టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా జనరల్ ఆస్పత్రి కార్మికుల పెండింగ్ వేతన బడ్జెట్ విడుదల కాకపోవడం శోచనీయమని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్‌వైజర్ కార్మికులకు బకాయి ఉన్న ఐదు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ సోమవారం నారాయణపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్‌కుమార్‌సింగ్‌కు కార్మికులు వినతిపత్రాన్ని అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా నాయకుడు ఎస్.సంతోష్, కార్మికులు లక్ష్మన్న, రాములు, రాజు, శ్రీనివాసులు, రాజలింగం, వెంకటేష్, కవిత, కృష్ణవేణి, రాము లమ్మ, లక్ష్మి, గోవిందమ్మ, అరుణ, మమత తదితరులున్నారు.

ముహూర్తాలు ఖరారు

5వ పేజీ తరువాయి

ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించిన ఎస్ఈసీ.. అక్టోబరు 9న మొదటి విడతకు, 13న రెండో విడతకు నోటిఫికేషన్ విడుదల చేయనుంది. అయితే ముందుగా ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించినప్పటికీ.. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే సర్పంచు ఎన్నికలకు కూడా నోటిఫికేషన్ ఇవ్వనుండటంతో ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలు.. సర్పంచు ఎన్నికల ఫలితాల తర్వాతనే ప్రకటించనున్నారు. ముందుగా ఎంపీటీసీ స్థానాల ఓట్లను లెక్కించి, విజేతలను ప్రకటిస్తే ఆ ప్రభావం సర్పంచు ఎన్నికలపై ఉంటుందనే కోణంలో ఎస్ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. అక్టోబరు 31, నవంబరు 4, 8 తేదీల్లో మూడు విడతలుగా నిర్వహించనున్న సర్పంచు ఎన్నికల ఓట్ల లెక్కింపు అదే రోజు చేపట్టనున్నారు. అక్టోబరు 23, 27 తేదీల్లో నిర్వహించే ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలను నవంబరు 11న ప్రకటించనున్నారు. స్థానిక సంస్థలకు మొదటి నోటిఫికేషన్ అక్టోబరు 9న ప్రారంభం కానుండగా.. నవంబరు 11 ఎంపీటీసీ ఓట్ల లెక్కింపుతో ప్రక్రియ ముగియనుంది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం పకడ్బందీగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించడానికి సన్నద్ధమవుతోంది.

77 జడ్పీటీసీ.. 800 ఎంపీటీసీ స్థానాలు..

ఉమ్మడి పాలమూరులో మొత్తం ఐదు జిల్లాలు ఉండగా.. అన్నింటి పరిధిలో కలిపి 77 జడ్పీటీసీ స్థానాలు, 800 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటన్నింటికీ రెండు విడతల్లో ఎన్నికలు జరుగనున్నాయి. జిల్లాలో అందుబాటులో ఉన్న ఎన్నికల సిబ్బంది, ఏర్పాట్లు, పోలీసు బలగాలు అన్నీ అంచనా వేసుకుని సగం మండలాలకు ఒకసారి.. సగం మండలాలకు మరోసారి ఎన్నికలు నిర్వహించనున్నారు.

మొదటి విడత నోటిఫికేషన్

ఇప్పటికే ఎంపీటీసీ రిజర్వేషన్లకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. మొదటి విడతకు అక్టోబరు 9న నోటిఫికేషన్ విడుదల చేసి.. అదే రోజు ఓటర్ల జాబితా ప్రదర్శిస్తారు. ఆ రోజు నుంచి 11వ తేదీ వరకు నామినేషన్లు వేయవచ్చు. 12న నామినేషన్ల పరిశీలన, అదే రోజు చెల్లుబాటైన అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. ఆ రోజు, తర్వాతి రోజు అభ్యంతరాలను స్వీకరిస్తారు. 14వ తేదీన అభ్యంతరాలను పరిష్కరిస్తారు. 15వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇచ్చి.. అదేరోజు తుది అభ్యర్థుల జాబితాను ప్రదర్శిస్తారు. 23వ తేదీన మొదటి విడత పోలింగు నిర్వహిస్తారు.

రెండో విడత నోటిఫికేషన్

రెండో విడతకు సంబంధించి అక్టోబరు 13న నోటిఫికేషన్ విడుదల చేసి.. అదే రోజు ఓటర్ల జాబితా ప్రదర్శిస్తారు. ఆ రోజు నుంచి 15వ తేదీ వరకు నామినేషన్లు వేయవచ్చు. 16న నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. ఆ తర్వాతి రోజు అభ్యంతరాలను స్వీకరిస్తారు. 18న అభ్యంతరాలను పరిష్కరిస్తారు.

19 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇచ్చి.. అదేరోజు తుది అభ్యర్థుల జాబితాను ప్రదర్శిస్తారు. 27వ తేదీన మొదటి విడత పోలింగు నిర్వహిస్తారు. రెండు విడతలకు సంబంధించి ఓట్ల లెక్కింపును మాత్రం సర్పంచ్ ఎన్నికల తర్వాత నవంబ రు 11న చేపడతారు. ప్రస్తుతం ఆయా జిల్లాలు, దశలవారీగా స్థానాలను విభజించి.. ఎన్నికల కమిషన్ ఆమోదం కోసం పంపారు. తుది జాబితాను నేడు ప్రకటించే అవకాశం ఉంది.

1678 సర్పంచు స్థానాలు..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 1,678 సర్పంచు స్థానాలు ఉన్నాయి. వీటికి మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించాలని ఎస్ఈసీ నిర్ణయించింది. వనపర్తి, గద్వాల, నారాయణపేట జిల్లాల్లో తక్కువ పంచాయతీలు ఉన్న కారణంగా మొదటి రెండు విడతలు లేదా తర్వాత రెండు విడతల్లో మాత్రమే ఎన్నికలు నిర్వహించనున్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో పంచాయతీలు ఎక్కువగా ఉండటంతో మూడు విడుతలుగా ఎన్నికల ప్రక్రియ చేపట్టనున్నారు. మొదటి విడత నోటిఫికేషన్ 17వ తేదీన ఇవ్వనున్నారు. పోలింగ్ అక్టోబరు 31న చేపట్టి, అదే రోజు ఓట్లను లెక్కించనున్నారు. రెండో విడత నోటిఫికేషన్ అక్టోబరు 21న విడుదల చేసి.. నవంబరు 4న పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు ఓట్లను లెక్కించి, విజేతలను ప్రకటిస్తారు. మూడో విడతకు సంబంధించి 25న ప్రక్రియ ప్రారంభించి, నవంబరు 8న పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు ఓట్లు లెక్కిస్తారు. ఎంపీటీసీ ఎన్నికలు, సర్పంచు ఎన్నికలు సమాంతరంగా జరిగే అవకాశం ఉండటంతో అధికారులు పకడ్బందీగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లతో పాటు ఇతర సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఇప్పటికే వారికి శిక్షణను కూడా పూర్తి చేశారు.

క్రైం కార్నర్

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

» డీఎస్పీ మొగులయ్య



పానీపూరి బండి యజమాని నుంచి వివరాలను సేకరిస్తున్న డీఎస్పీ మొగులయ్య

గద్వాల క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తులపై దాడి చేసి, యువతులను వేధించిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ మొగిలయ్య తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని, కొత్తహౌసింగ్‌బోర్డు వెళ్లేదారిలో రాజస్థాన్‌కు చెందిన జస్వీర్‌సింగ్ అనే వ్యక్తి పానీపూరీ బండి నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి సోను, నర్సింహులు, శశి మద్యం తాగి బండి వద్దకు వచ్చి పానీ పూరీ తిన్నారు. యజమానికి డబ్బులు ఇవ్వకుండా అతడిపై దాడి చేశారు. బండి అద్దాలను పగుల గొట్టారు. పక్కనే ఉన్న గ్యాస్ సిలిండర్‌ను రోడ్డుపై విసిరేయడంతో అటుగా వెళ్తున్న యువకులకు తగిలింది. అంతటితో ఆగకుండా బండి వద్ద పానీ పూరీ తినేందుకు వచ్చిన యువతులతో అసభ్యంగా ప్రవర్తించారు. వారిని అడ్డుకునేందుకు యత్నించిన స్థానికులపైనా దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు ఇటీవలే దాడి కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. మరొకరు గంజాయి కేసులో ఉన్నారు. ఈ ఘటనపై సోమవారం డీఎస్పీ మొగిలయ్య విచారణ చేపట్టారు. పానీపూరి బండి యజమాని జస్వీర్‌సింగ్‌తో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

యువకుడి ఆత్మహత్య



వెంకటయ్య (ఫైల్)

చారకొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మానసిక వేదనతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని జేపల్లి గ్రామంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ శంషుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంకేశ్వరం వెంకటయ్య (35) భార్య ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటినుంచి మానసిక వేదనను అనుభవిస్తున్న వెంకటయ్య ఆదివారం రాత్రి పక్క గదిలో పడుకుంటానని తండ్రి లక్ష్మయ్యకు చెప్పి వెళ్లాడు. సోమవారం ఉదయం అతడు గదిలో నుంచి బయటకు రాకపోవడంతో తండ్రి కిటికీలో నుంచి చూడగా, ఉరి వేసుకొని కనిపించాడు. చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు తెరిచి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. సంఘటనపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు

» ఇద్దరికి తీవ్ర గాయాలు

వంగూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని హైదరాబాద్ - శ్రీశైలం రహదారిపై సోమవారం ఉదయం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన దినేశ్, చింటు కారులో శ్రీశైల క్షేత్రానికి బయటుదేరారు. వారు వెళ్తున్న కారు వంగూరు గేటు సమీపంలో అదుపు తప్పి చెట్టుకు ఢీకొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గేదె

బాలానగర్, సెప్టెంబరు 29 : మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్‌లో విద్యుదాఘాతంతో ఓ గేదె మృతి చెందింది. యాజమాని గిల శ్రీశైలం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆయనకు చెందిన గేదె మండల కేంద్రంలోని పోచమ్మ గుడి సమీపంలో మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లి విద్యుదాఘాతానికి గురై చనిపోయింది. దాని విలువ రూ.70 వేలు ఉంటుందని శ్రీశైలం తెలిపాడు.

మొసళ్ల కలకలం



మాన్‌దొడ్డి గ్రామ శివారులోని తుంగభద్ర నదిలో కనిపించిన మొసలి

రాజోలి/ మక్తల్ రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల, నారాయణపే ట జిల్లాల్లో సోమవారం రెండు మొసళ్లు కలకలం సృష్టించాయి. రాజోలి మం డలంలోని మాన్‌దొడ్డి శివారులోని తుంగభద్ర నది ఒ డ్డునున్న బండరాయిపై మొసలి పడుకొని ఉండటా న్ని స్థానిక యువకులు గ మనించారు. వారి అలికిడి విన్న మొసలి నీటిలోకి వెళ్లిపోయింది. అలాగే మక్తల్ మండలంలోని చిట్యాల - పసుపుల మధ్య రహదారి పై సంచరిస్తున్న మొసలిని స్థానికులు గమనించి వీడి యో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది.



చిట్యాల, పసుపుల రహదారిపై నుంచి పొలాల్లోకి వెళ్తున్న మొసలి

డీసీఎం బోల్తా

» 10 మందికి గాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం

» పెళ్లి విందుకు వెళ్లి వస్తుండగా ప్రమాదం

అలంపూరు చౌరస్తా, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి విందుకు వెళ్లి వస్తుండగా డీసీఎం వ్యాను బోల్తాపడి పది మందికిపైగా గాయపడ్డారు. వారిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండలంలోని జమ్మిచేడు గ్రామానికి చెందిన దాదాపు 50 మంది కర్నూలులో సోమవారం జరిగిన పెళ్లి విందుకు వెళ్లారు. రాత్రి 10 గంటలకు అక్కడి నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ఉండవల్లి మండలంలోని ఇటిక్యాలపాడు స్టేజీ సమీపంలో వారు వస్తున్న డీసీఎం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో నూర్ అహ్మద్, బాషా, నస్రీన్, బాషా, షాన్‌బీ, రజియా, అబ్దుల్‌హుసేన్, అబూబకార్ లతో పాటు మరో ఇద్దరు గాయపడ్డారు. వారిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను రెండు 108 అంబులెన్సులలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు హైవే సిబ్బంది తెలిపారు.

పెరిగిన వరద..
నీట మునిగిన పంటలు

» పరిహారం అందకముందే రైతులకు తీవ్ర నష్టం

» నిధులు విడుదలలో జెన్‌కో జాప్యం



పంట పొలాలతో పాటు మునిగిపోయిన రోడ్డు

గద్వాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, భీమా నదుల నుంచి వరద పోటెత్తుతుండటంతో జూరాల ప్రాజెక్టు ద్వారా 5 లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో దిగువ జల విద్యుత్ కేంద్రం వద్ద కృష్ణానదిపై నిర్మించిన అడ్డుగోడకు నీళ్లు తగిలి వెనక్కి మళ్లుతున్నాయి. దీంతో జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండలంలోని రేకులపల్లి గ్రామానికి చెందిన రైతుల పంట పొలాలు దాదాపు వంద ఎకరాలకు పైగా నీట మునిగాయి. మూడు రోజులుగా నదీ ప్రవాహం పెరుగుతూ ఉండటంతో పొలాల్లో కొంత కొంత నీరు చేరుతూ ఉంది. ఆదివారం ఒకే సారి 5 లక్షల క్యూసెక్కులకు పైగా వరద రావడంతో ఎక్కువ మొత్తంలో పొలాలు నీట మునిగిపోయాయి.

రేకులపల్లి వద్ద ఇదీ పరిస్థితి

గద్వాల మండలంలోని రేకులపల్లి గ్రామం వద్ద ప్రభుత్వం లోయర్ జూరాల జల విద్యుత్ కేంద్రం పనులను 2008లో ప్రారంభించి, 2014లో పూర్తి చేసింది. 2015 నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించింది. ఇందుకోసం కృష్ణానదిపై ఆనకట్ట నిర్మించింది. దీని వలన నదీ ప్రవాహం వెనక్కి వెళ్లి పంటపొలాలు ముంపునకు గురవుతున్నాయి. 299 మీటర్ల వద్ద భూ సేకరణ చేసి, అప్పట్లో పరిహారం చెల్లించారు. కానీ నదీ ప్రవాహం 3 లక్షల క్యూసెక్కుల కంటే ఎక్కువగా పెరిగితే రెండువైపులా వందల ఎకరాల్లో భూములు ముంపునకు గురవుతున్నాయి. దీంతో రైతులు తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనలు చేపట్టారు. కలెక్టరేట్, లోయర్ జెన్‌కో కార్యాలయాల ముందు ధర్నాలు చేశారు. దీంతో అప్పట్లో తాత్కాలిక ఉపశమనం కింద ఎకరానికి రూ.12 వేల చొప్పున 2015 నుంచి 2018 వరకు పంట పరిహారం ఇచ్చారు. కానీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని రైతులు ఉద్యమించడంతో ఎట్టకేలకు భూసేకరణ చేశారు. 301 మీటర్ల ఎత్తు వరకు నీటి ప్రవాహాన్ని పరిశీలించి, ఎంత మేరకు పొలాలు నీట మునుగుతాయో సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు భూమిని సర్వే చేశారు. సర్వే నెంబర్ 226 నుంచి 270 వరకు దాదాపు 67.30 ఎకరాలలో భూమి ముంపునకు గురవుతుందని ప్రభుత్వానికి నివేదించారు. అందులో దాదాపు 120 మంది రైతుల భూములు ఉన్నాయి. .

నది పక్కనే పొలం..



నది పక్కనే నాకు 5 ఎకరాల పొలం ఉంది. మొదట మునిగేది నా పొలమే. అందులో మూడు ఎకరాల్లో తోట ఉంది, మిగిలిన రెండు ఎకరాలలో వరి వేస్తాను. ముంపునకు గురవుతుందని భూసేకరణ చేశారు. కానీ ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదు. దీంతో పంట వేశాను. నదికి వరద రావడంతో పంటలు నీట మునిగాయి. పరిహారం అందక ఇబ్బంది పడుతున్నాను.

\- విజయ్‌మోహన్‌రెడ్డి, రైతు రేకులపల్లి, గద్వాల

పూర్తిగా అందని పరిహారం

రెవెన్యూ అధికారుల సర్వే ప్రకారం రైతులకు లోయర్ జెన్‌కో రూ.6 కోట్లకు పైగా చెల్లింపులు చేసేందుకు ముందుకు వచ్చింది. అందులో మొదటి విడతగా రూ.4.32 కోట్లను ఆర్డీఓ ఖాతాలో జమ చేసింది. కానీ అప్పట్లో అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా ఉన్న రైతులకు చెల్లింపులు చేశారు. మిగిలిన రైతులను కార్యాలయం చుట్టు తిప్పుతున్నారు. రెండవ విడతగా ఇంకా రూ.2 కోట్ల మేర పరిహారం రావాల్సి ఉంది. అది కూడా రైతులకు అందలేదు. దీంతో రైతులు ఆ భూమిలో పంటలు సాగు చేశారు. తాజా వరదల్లో పంటలు మునిగాయి. భూసేకరణ చేసిన రైతులతో పాటు సర్వే చేయని పంట పొలాలు కూడ నీట మునిగాయి. తమ పొలాలకు కూడా పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కృష్ణ, భీమా నదులకు పోటెత్తుతున్న వరద

» నారాయణపేట జిల్లాలో నీట మునిగిన పంటలు

» ప్రధాన ఆలయాల్లోకి చేరిన నీరు



కృష్ణ బ్రిడ్జి దగ్గర నీటమునిగిన వరి పంట



వరద నీటిలో మునిగిన మణికంఠ ఎత్తిపోతల పథకం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

నారాయణపేట/కృష్ణ సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లాలో కృష్ణ, భీమా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కృష్ణ మండలంలోని తంగిడిగి వద్ద భీమా, కృష్ణ సంగమ క్షేత్రంలోని దత్త భీమేశ్వరాలయాన్ని వరద చుట్టుముట్టింది. మొదటి అంతస్తు వరకు నీరు చేరింది. కుసుమూర్తి వద్దనున్న శ్రీకృష్ణ ద్వైపాయ ఆలయం, ముడుమాల్, యాదవేంద్ర స్వామి ఆలయాల్లోకి నీరు చేరింది. పుష్కర ఘాట్లు నీట మునిగాయి. నదీ పరివాహక ప్రాంతాలైన సుకర్‌లింగంపల్లి, కుసుమూర్తి, హళ్లహళ్లి, గుర్జల, హిందూపూర్, గుడెబల్లూర్, ముడుమాల్ తదితర గ్రామాల శివార్లలో దాదాపు 250 మంది రైతులకు సంబంధించిన 1,379 ఎకరాల్లో వరి పంటలు నీట మునిగిపోయాయి. కృష్ణ మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. తంగడిగి, హిందూపూర్, గుడెబల్లూరు, ముడుమాల్ గ్రామాల శివారులోని ఎత్తిపోతల పథకాల పంప్‌హౌస్‌లను వరద చుట్టుముట్టింది. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మోకాలి లోతు నీరు నిలిచింది. పక్కనే ఉన్న వరి, పత్తి పొలాల్లో నీరు చేరింది. హిందూపూర్ ప్రభుత్వ పశువుల వైద్య ఆసుపత్రి ప్రహరీని వరద తాకింది. దళితవాడకు సమీపంలో వరద ఉధృతంగా పారుతోంది.

వరద బాధితులను ఆదుకుంటాం

» క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి



మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

కృష్ణ ,సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని గుడెబల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వాసునగర్ క్యాంపును సోమవారం సాయంత్రం ఆ యన పరిశీలించారు. స్థానికులకు గుడెబల్లూరు జడ్పీహెచ్ఎస్‌లో బస ఏర్పాటు చేయాలని తహసీల్దార్, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. పశువులకు మేత అందుబాటులో ఉంచాలని చెప్పారు. నీట మునిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వరి, పత్తి పంటలు, ఇళ్లకు జరిగిన నష్టాలను పరిశీలించి, నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. నది వద్దకు వెళ్లకుండా గ్రామస్థులు, రైతులను అప్రమత్తం చేయాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని చెప్పారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజప్ప గౌడ, నాయకులు కృష్ణమూర్తి, వాకిటి నారాయణ, ఆనంద్ గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో సుదర్శన్ గౌడ్, ఎస్ఐ నవీద్ ఉన్నారు.

నేడు దుర్గాష్టమి వేడుకలు

» నారాయణపేట జిల్లాలో ప్రత్యేకం

» అమ్మవార్లకు పొట్టేళ్లను సమర్పించనున్న భక్తులు

» కర్ణాటకలోని అమీన్‌ఘడ్ నుంచి దిగుమతి



కర్ణాటక రాష్ట్రంలోని అమీన్‌ఘడ్‌లో పొట్టేళ్లను కొనుగోలు చేస్తున్న పేట వాసులు

నారాయణపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైభవంగా కొనసాగుతున్నాయి. ఎనిమిది రోజు మంగళవారం దుర్గాష్టమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకునేందుకు ప్రజలు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఈ వేడుకలను నారాయణపేట జిల్లాలో ప్రత్యేకంగా నిర్వహించుకుంటారు. జిల్లాలో మూడు, తొమ్మిది, పదకొండు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తారు. అందులో భాగంగా దుర్గాష్టమి నాడు మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు భక్తులు తమ ఇళ్లల్లో అమ్మవారికి పెట్టేళ్ల (గొర్రెలు)ను నైవేద్యంగా సమర్పిస్తారు. తరతరాల నుంచి ఈ ఆచారం కొనసాగుతోందని స్థానికులు చెప్తున్నారు.

20 శాతం పెరిగిన పొట్టేళ్ల ధర



పేటలో అమీన్‌ఘడ్ నుంచి పేటకు దిగుమతి చేసుకున్న పొట్టేళ్లు

కర్ణాటక రాష్ట్రంలోని బాగల్ కోట్ జిల్లా, అమీన్‌ఘడ్ గ్రామం పొట్టేళ్లు, గొర్రెల పెంపకానికి ప్రసిద్ధి. వాటిని మేతకోసం బయటకు పంపించకుండా ప్రత్యేకంగా దాణా ఇస్తూ పెంచుతారు. అవి పుష్టిగా పెరిగేలా జర్సీ ఆవుపాలు తాగిస్తారు, కోడిగుడ్లను తినిపిస్తారు. ఇలా ఏడాది పాటు పోషించి విక్రయానికి సిద్ధం చేస్తారు. ఒక్కో పొట్టేలు/గొర్రె 35 నుంచి 45 కిలోల బరువు తూగుతాయి. వాటి ధర రూ.15 వేల నుంచి రూ.90 వేల వరకు పలుకుతోంది. దుర్గాష్టమిని పురస్కరించుకొని జిల్లాకు చెందిన పలువురు 325 కిలోమీటర్ల దూరంలోని అమీన్‌ఘడ్ గ్రామానికి వెళ్లి పొట్టేళ్లను కొనుగోలు చేసి తీసుకొచ్చారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం వాటి ధరలు 20 శాతం పెరిగాయని కొనుగోలుదారులు తెలిపారు. మరికొందరు స్థానికంగా పొట్టేళ్లను కొనుగోలు చేస్తారు. వాటి ధర రూ.10 వేల నుంచి రూ. 30 వేల వరకు ధర పలుకుతోంది. వాటికి ప్రత్యేక దాణా, గరిక తినిపిస్తూ, పాలు తాగిస్తూ అమ్మవారికి సమర్పించేందుకు సిద్ధం చేశారు.

దుకాణం యజమానిపై ట్రాన్స్‌జెండర్ల దాడి

» కేసు నమోదు చేసిన పోలీసులు



బుక్ షాపు ముందు గొడవ చేస్తున్న ట్రాన్స్‌జెండర్లు

అయిజ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అడిగినంత డబ్బు ఇవ్వలేదని కొందరు ట్రాన్స్‌జెండర్లు దుకాణం యజమానిపై దాడి చేశారు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజలో సోమవారం సాయంత్రం జరిగింది. పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో ఉన్న శివ బుక్ షాపునకు ట్రాన్స్‌జెండర్లు వెళ్లి దసరా మామూలు అడిగారు. దుకాణం యజమాని అంబ్రేష్‌కుమార్ రూ. 20 ఇవ్వగా, వారు తీసుకోలేదు. రూ. 500 ఇవ్వాలని కోరుతూ గొడవ చేసి, యజమానిపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏడుగురు ట్రాన్స్‌జెండర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

పోలేపల్లి సెజ్‌లో 'ఏరోఫ్లెక్స్' ప్రారంభం

» ముఖ్యఅతిథిగా పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి

» పాల్గొన్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లో పరిశ్రమను ప్రారంభిస్తున్న పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుఖ్జిందర్‌సింగ్ రంధావా

జడ్చర్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని పోలేపల్లి సెజ్‌లో ఏర్పాటు చేసిన ఏరోఫ్లెక్స్ పరిశ్రమను పంజాబ్ మాజీ ఉపముఖ్యమంత్రి సుఖ్జిందర్‌సింగ్ రంధావా సోమవారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి ఇలాంటి కంపెనీలను ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో దేవరకద్ర, షాద్‌న గర్ ఎమ్మెల్యేలు మధుసూధన్‌రెడ్డి, వీర్లపల్లిశంకర్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసే నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ల ఆధునికీకరణకు నిధులు

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని 30 ఆర్టీసీ బస్టాండ్ల ఆధునికీకరణకు దాదాపు 108.02 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. అందుకోసం ఎంపిక చేసిన వాటిలో ఉమ్మడి జిల్లాకు చెందిన నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, అయిజ, వనపర్తి, పెబ్బేర్, కొల్లాపూర్, పెంట్లవెల్లి బస్టాండ్లు ఉండటంపై హర్షం వ్యక్తం అవుతోంది. అయితే ఈ విషయంపై ఆర్ఎం సంతోష్ కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా ఉమ్మడి జిల్లాకు చెందిన 7 డిపోలకు ఎన్ని నిధులు మంజూరయ్యాయో స్పష్టత లేదన్నారు. ఇదే విషయంపై స్థానిక ఎమ్మెల్యే కూడా అడిగారని తెలిపారు. నిధుల మంజూరుపై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

అక్టోబరు 1 నుంచి టైగర్ సఫారీ పునరుద్ధరణ

మన్ననూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూలు జిల్లా, అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో వచ్చేనెల 1 నుంచి టైగర్ సఫారీ సేవలను పునరుద్ధరించనున్నట్లు ఏటీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ హిరేమత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపులులతో పాటు, ఇతర వన్యప్రాణుల సంతానోత్పత్తి సమయం కావడంతో జూలై 1 నుంచి ఈనెల 30 వరకు టైగర్ సఫారీని నిలిపివేసినట్లు పేర్కొన్నారు. మూడు నెలల నిషేధ సమయం మంగళవారంతో ముగియడంతో అక్టోబరు 1 నుంచి టైగర్ సఫారీకి పర్యాటకులను అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. సఫారీలో గుండం, పర్హాబాద్ వ్యూపాయింట్, అక్కమదేవీ గుహల సందర్శన, ప్రతాపరుద్రుడి కోట, ఉమామహేశ్వరానికి ట్రెక్కింగ్ ఉంటుందని పేర్కొన్నారు. అడవిలో పెద్ద పులులతో పాటుగా, ఇతర వన్య ప్రాణుల సంచారాన్ని ప్రత్యక్షంగా చూడొచ్చని తెలిపారు. పర్యాటకులకు సహకారాన్ని అందించేందుకు నేచర్ గైడ్లు, సఫారీ వాహనాలను, డ్రైవర్లను సిద్ధం చేశామని తెలిపారు.

ఇంటర్వ్యూ..

పనుల కోసం ప్రతిపాదనలు పంపించాం

» ఏఈ మహేష్



ఉప్పునుంతల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ పనుల కోసం పంచాయతీరాజ్ శాఖ నుంచి ప్రతిపాదనలు పంపించామని ఆ శాఖ ఏఈ మహేష్ తెలిపారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

● ఏఏ పనులకు ప్రతిపాదనలు పంపారు?

ఏఈ: ఉప్పునుంతల నుంచి కొత్తరాంనగర్, ఉప్పునుంతల నుంచి తాడూరు రోడ్లకు మెయింటెనెన్స్ కింద ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే పనులు చేపడుతాం.

● నూతన గ్రామపంచాయతీలకు భవనాలు ఎన్ని మంజూరయ్యాయి?

ఏఈ: గువ్వలోనిపల్లి, దాసర్లపల్లి, గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ భవనాలు మంజూరయ్యాయి. పనులు జరుగుతున్నాయి. అదే విధంగా ఈజీఎస్ కింద రాయిచెడి, అయ్యవారిపల్లి, లత్తిపూర్, తిప్పాపూర్, మామిళ్లపల్లిలో కూడా మంజూరయ్యాయి. పనులు ప్రారంభం కాలేదు.

● పోలేపల్లి-మామిళ్లపల్లి రోడ్డు ఎప్పటి వరకు పనులు పూర్తవుతాయి?

ఏఈ: కాంట్రాక్టర్‌కు చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. త్వరలోనే పనులు పూర్తి చేసే విధంగా చూస్తాం

● ఉప్పునుంతల నుంచి పొల్కంపల్లి రోడ్డు పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు?

ఏఈ: త్వరలోనే పనులు ప్రారంభించే విధంగా చూస్తాం.

● అభివృద్ధి పనులు జరుగుతున్నాయా?

ఏఈ: మండలంలోని గట్టుకాడిపల్లిలో డ్రైనేజి పనులు జరుగుతున్నాయి తప్పా ఎక్కడ ఏమి పనులు జరుగడం లేదు.

వి'పత్తి'!





పత్తి చేలో ఉన్న వర్షపు నీరు, తడిసి గిటక బారిన పత్తి కాయలు

» వరుస వర్షాలతో సన్నగిల్లుతోన్న రైతు ఆశలు

» నల్లబారిన తెల్లబంగారం

» జిల్లాలో 2,82,384 ఎకరాల్లో పత్తి సాగు

» ఆగస్టు వరకు 311.24 ఎకరాల్లో వివిధ పంటల నష్టం

అచ్చంపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజోతి) : ప్రకృతి కన్నెర్ర చేయడంతో చేతికంది వచ్చే పంటలు తడిసి ముద్దయ్యాయి. ఎర్రబారిపోతున్నాయి. విపత్కర పరిస్థితిలో పత్తి రైతు ఆశలు సన్నగిల్లుతున్నాయి. వరుస వర్షాలతో ప్రధానంగా పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నది. జిల్లాలో 20 మండలాల్లో 2లక్షల 82 వేల 384 ఎకరాలలో పత్తి పాగు చేశారు. అధిక వర్షాలతో కల్వకుర్తి, కోడేరు, లింగాల, నాగర్‌కర్నూల్, తెలకపల్లి మండలాల్లో ఆగస్టు వరకు పత్తి, వరి, జొన్న పంటలు 311.24 ఎకరాలలో దెబ్బతిన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వరదలలో పంటలు మునిగిపోవడం, కోతకు గురికావడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. పూర్తిస్థాయి సమాచారం అందితే పంట నష్టం పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఎడతెరిపి లేని వర్షాలతో పత్తి పంటలో చీడపీడలు అధికమవ్వడమే కాకుండా తెగుళ్లభారిన పడి పంట నల్లబారిపోతున్నది. దీనికి తోడు రైతులకు కూలీల కొరత తీవ్రమైంది. ఇతర ప్రాంతాల నుంచి అధిక మొత్తంలో కూలీ డబ్బులు చెల్లించి తీసుకొచ్చుకొంటున్నారు. సాధారణంగా ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల పత్తి దిగుబడి రావాల్సి ఉంటే ప్రస్తుతం వర్షాలకారణంగా ఎకరాకు 4 క్వింటాళ్లు దాటేపరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

● వర్షాలకు పంటలు ఇలా..

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పత్తి పంటలో ఎర్రగుమ్మడి తెగులుతో పాటు తెల్లదోమ, పచ్చదోమ, వేరుపురుగు ఆశించడం, ఆకులు గులాబీ రంగులోకి మారాయి. పత్తిలోని గింజలు మొలకెత్తి రంగుమారుతున్నది. ఈ నేపథ్యంలో రైతుకు పెట్టుబడులు మీద పడడమే కాకుండా అప్పులు మూట కట్టుకునే పరిస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు.

● చేసిన కష్టం పోయింది



ఈ ఏడాది అయినా పంటలు బాగా పండి అప్పులు తీరి మా కష్టాలు పోతాయనుకుంటే వానల మీద వానలు కురుస్తూ దెబ్బతీస్తున్నాయి. ఎప్పుడూ లేని విధంగా ఈ సారి వానలు కురుస్తున్నాయి. పంట వచ్చేటప్పుడు వాన రాకుండా ఉంటే బాగుండేది. ఈ సారి చేసిన కష్టం పోయి అప్పులే మిగిలాయి.

- జి.తిరుపతయ్య, కొత్తచెరువుతండా

చదువుల తల్లీ.. నమోనమామి

» జిల్లాలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

» ప్రత్యేక పూజలు నిర్వహించిన కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కజైపాల్‌యాదవ్



వాసవీమాతను దర్శించుకున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

కల్వకుర్తి/అచ్చంపేట/అచ్చంపేటటౌన్/అమ్రాబాద్/కందనూలు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అమ్మవారిని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్‌లు రాచోటి శ్రీశైలం, ఎడ్మ సత్యంలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీమాత సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు షాహిద్, గోవర్ధన్, విజయ్‌గౌడ్, మనోహర్‌రెడ్డి, సూర్యప్రకాశ్‌రావు, బాలయ్య, లక్ష్మీనరసింహరెడ్డి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఉమామహేశ్వర క్షేత్రంలో సోమవారం అమ్మవారు సరస్వతీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లాలోని పలుప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు ఉమామహేశ్వరుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలతో పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస రావు, ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డిలు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పరిశీలించారు. అర్చకులు వీరయ్య, రాజశేఖర్, రవికుమార్‌లు భక్తులకు పూజలు చేయించారు. అచ్చంపేట పట్టణంలోని భ్రమరాంబికా దేవి ఆలయంలో సర్వసతి దేవిగా సోమవారం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధ్యక్షుడు శ్రీధర్ ఆధ్వర్యంలో అమ్మవారిని అలకిరించారు. పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, గణపతి అయ్యప్ప స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. అర్చకులు ఉదయ్ భాస్కర్ శర్మ, శ్రీనివాస్ శర్మ భక్తులకు పూజలు చేయించారు. అదేవిధంగా కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆలయ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సర్వసతిదేవికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



సంతబజార్‌లో ఏర్పాటు చేసిన తుల్జాభవానీకి పూజలు చేస్తున్న ఉషారాణి



మహా సరస్వతీ రూపంలో అమ్మవారు

పట్టణంలోని భక్తమార్కండేయ ఆలయంలో కూడా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలో కమిటీ అధ్యక్షుడు వనం పర్వతాలు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మునిసిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అమ్రాబాద్ మండల కేంద్రంలోని అమరేశ్వర ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. అంతకంటే ముందు సీబీఎం ట్రస్టుచైర్మన్, అమ్రాబాద్ మాజీ జడ్పీటీసీ డాక్టర్ అనురాధ దుర్గామాత విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తాలో గల శ్రీజ్ఞాన సరస్వతి దేవాలయంలో సోమవారం అమ్మవారు మహా సరస్వతి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లాలోని వివిధప్రాంతాల్లో గ్రామాల నుంచి వచ్చిన చిన్నారులు 108 మందికి ప్రత్యేకంగా అక్షరాభ్యాసం, 9మంది చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించినట్లు శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఆకారపు విశ్వనాథం, కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్య తెలిపారు. అన్న ప్రసాద కమిటీ ద్వారా 1800మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్య, కమిటీ సభ్యులు, అనాథ బాలల రక్షణ కమిటీ అధ్యక్షుడు దొడ్ల నారాయణరెడ్డి, ఆలయ పూజారులు పాల్గొన్నారు. సంతాబజార్‌లో ఏర్పాటు చేసిన తుల్జాభవానీ అమ్మవారి మండపంలో అమ్మవారిని జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.ఉషారాణి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. డాక్టర్ రోహిత్, డాక్టర్ ప్రదీప్, కమిటీ అధ్యక్షులు హాడేకర్ నవీన్, రాఘవ, సంతోష్, సతీష్, భవాని, మాజీ కౌన్సిలర్ హాడేకర్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

» ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి

తెలకపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు సేవా దృక్పథాన్ని పెంపొందించుకుని సాధ్యమైనంతవరకు తమ ప్రాంతాల వారికి సేవ చేయాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం తెలకపల్లికి చెందిన వారు సీఎల్ఆర్ విద్యాసంస్థలో దాత చీమర్ల జగదీశ్వర్‌రెడ్డి, మేమలత సౌజన్యంతో శంకర నేత్రాలయ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో గత వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న కంటి పొర చికిత్స శిబిరం సోమవారం ముగింపు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాంతానికి చెందిన ఎన్ఆర్ఐలు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని వాళ్లను స్ఫూర్తిగా తీసుకొని ప్రతీ ఒక్కరు ముందుకెళ్లాలని అన్నారు. ఉచిత కంటి పొర దాత చీమర్ల జగదీశ్వర్‌రెడ్డి, హేమలత, సీఎల్ఆర్ కరస్పాండెంట్ రాజమహేందర్‌రెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి రమేశ్‌రెడ్డిలను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈసందర్భంగా దాతలు, నిర్వాహకులు మాట్లాడుతూ పుట్టిపెరిగిన ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కంటి పొర శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 800 మందికి కంటి పరీక్షలు, 100 మందికి ఆపరేష న్‌లు చేసినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యేతో పా టు మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, సీఎల్ ఆర్ విద్యాసంస్థ కరస్పాండెంట్ రాజమహేంద ర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి చీమర్ల రమేశ్ రెడ్డి, విద్యాసంస్థ డైరక్టర్లు పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే

నాగర్‌కర్నూల్ టౌన్,(ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని 18వ వార్డు శ్రీనగర్‌కాలనీలో కొలువైన దుర్గామాత అమ్మవారిని సోమవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి దర్శించుకున్నారు. వార్డు నాయకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మాజీ కౌన్సిలర్లు జక్కా రాజ్‌కుమార్‌రెడ్డి, బచ్చన్నయాదవ్, నాయకులు తీగల దినేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు



బీజేపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

చారకొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరసనగండ్లకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నివాసంలో బీజేపీలో చేరారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే వారికి బీజేపీ కండువా కప్పి ఆహ్వానించారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కమోజీ శ్రీకాంత్, బీజేపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండ్ల మల్లేష్ యాదవ్, బీజేపీ నాయకులు పగడాల శ్రీరాములు, ఎదిరే రవిందర్, పగడాల తిరుపతయ్య, మల్లేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2లో ఎంపీఈవోగా ఉద్యోగం



రాజీవ్

అమ్రాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని మాధవానిపల్లి గ్రామానికి చెందిన నూనె ఆశీర్వాదం నూనె రాజీవ్‌కు గ్రూప్-2లో ప్రతిభ కనబర్చి పంచాయతీరాజ్ విభాగంలో ఎంపీఈవోగా ఎంపికైనాడు. రాజీవ్ గతంలోనే గ్రూప్-3లో గ్రూప్-4లో కూడా ప్రతిభ కనబర్చి ఉద్యోగాలు సాధించగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని జడ్చర్లలో కమర్షియల్ టాక్స్ ఆఫీసు లో (గ్రూప్-4 ఉద్యోగం) జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం గ్రూప్-2 లో ఎంపీఈవోగా ఉద్యోగం సాధించడం పట్ల కుటుంబ కుటుంబ సభ్యులు మాధవానిపల్లి గ్రామస్థులు సోమవారం హర్షం ప్రకటించారు.

గ్రామ పంచాయతీకి వీధి దీపాల అందజేత

వెల్దండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో వెలుగులు నింపాలనే లక్ష్యంతో మండల కేంద్రానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ సోమవారం పంచాయతీకి వీధి దీపాలను అందజేశారు. సుమారు లక్ష రూపాయలకుపైగా సొంతడబ్బును వెచ్చించిన వెంకటయ్యగౌడ్ ఈ మేరకు గ్రామకార్యదర్శి గిరిగౌడ్‌కు దీపాలను అందజేశారు. గ్రామాభివృద్ధిలో తనవంతు భాగస్వామిని అవుతానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సంజీవ్‌కుమార్, నాయకులు రషీద్, ఎర్రశ్రీను, హమీద్, పుల్లయ్య, పురుషోత్తమాచారి, తిరుపతిరెడ్డి, కిష్టాల్, భరత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న నాయకులు

వెల్దండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పగండ్ల గ్రామంలో స్వయంసహాయక సంఘాల మహిళలను జాతీయ మిషన్ ఎడబుల్ ఆయిల్‌సీడ్స్ పథకంలో భాగంగా ఉచితంగా వేరుశనగ విత్తనాలను స్థానిక నాయకులు అందజేశారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. సీసీ విమల, సీఈవో శరత్‌కుమార్, ఏఈవో హబీబున్నిసా, మండలకాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రమేష్‌ముదిరాజ్, శివరాజ్‌గౌడ్, రమేష్‌గౌడ్, శ్రీధర్, వీవోఏలు స్వప్న, అంజయ్య, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

అవకతవకలపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు

వెల్దండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్థానికసంస్థల ఎన్నికలలో విడుదల చేసిన రిజర్వేషన్లలో బీసీలకు పెద్దఎత్తున అన్యాయం జరిగిందంటూ బీఆర్‌ఎస్ మండల నాయకుడు గండికోట రాజు సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదుచేశారు. మండలంలో 32 గ్రామపంచాయతీలలో ఎస్టీలకు 13, ఎస్సీలకు 5, బీసీలకు 8, జనరల్ స్థానాలకు 6 స్థానాలు కేటాయించిందని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవికుమార్

చారకొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ రవికుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాదులు ప్రబలకుండా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి అవగాహన కల్పించాలని అన్నారు. డాక్టర్ సృజన, సీహెచ్‌వో బాల్‌రాం, హెచ్ఈవో ఎన్వీవీ చారి, హెల్త్ అసిస్టెంట్ శక్రు, ఏఎన్ఎంలు అలివేలు, కల్పన, కళమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జమ్మి వృక్షం పునఃప్రతిష్ఠ

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంట్రావుపల్లిలో సోమవారం జమ్మి వృక్షం పునఃప్రతిష్ట పునః కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ శివారులో స్థల దాత మాజీ పట్వారీ, కరణం వెంకట కిషన్ రావు వ్యవసాయ పొలం వద్ద నూతనంగా జమ్మి చెట్టు కోసం దిమ్మె ఏర్పాటుతో పాటు జమ్మి వృక్షం పునఃప్రతిష్ఠా కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో ప్రకాశ్‌రావు, సాయిరాం, యాదగిరి చారి, గజేంద్రచారి, ప్రసాద్‌చారి, బాలస్వామి చారి, రంగారావు, పరుశరాముడు, బాబు పాల్గొన్నారు.

ఉత్తమ రీజియన్ చైర్మన్‌గా తెప్ప శ్రీను

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన తెప్ప శ్రీను లయన్స్ క్లబ్ రీజియన్ చైర్ పర్సన్ అవార్డు పొందారు. ఆదివారం రాత్రి హైదరాబాదులో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు కోటేశ్వర్‌రావు, డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. అవార్డు రావడం పట్ల లయన్స్ క్లబ్ చైర్మన్లు, సభ్యులు సోమవారం హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయిలో అవార్డు కైవసం చేసుకున్న పిట్టల మహేష్

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఫోటోజనిక్ ఆర్ట్స్ సర్కిల్ సంస్థ, ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ వారు ఫోటోగ్రఫీ డే సందర్భంగా ఆగస్టు 19న నిర్వహించిన ఆన్‌లైన్ కాంపిటేషన్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి వాసి పిట్టల మహేష్ తన ప్రతిభతో ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును గుంటూరులో ఆదివారం ఫొటో జనిక్ ఆర్ట్స్ సర్కిల్ సంస్థ వ్యవస్థాపకులు కనకాల సుధాకర్‌రెడ్డి, తియ్యగురా సీతారామిరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డు పొందిన సందర్భంగా ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు మిత్ర రాజు, కాశీంరాజు, లింగం, నరసింహ, గోపి, మండలంలోని ఫొటోగ్రాఫర్స్ మహేష్‌ను అభినందించారు.

గ్రామ పాలన అధికారిగా రాజు బాధ్యతల స్వీకరణ



చారకొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరసనగండ్ల గ్రామానికి నూతన గ్రామ పాలన అధికారి (జీపీవో)గా సోమవారం ఎట్టి రాజు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన రాజుకు తహసీల్దార్ అద్దంకి సునీత, గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, గ్రామస్థులు శుభకాంకక్షలు తెలిపారు.

నిజాయితీ చాటుకున్న కరాటే విద్యార్థులు

» రోడ్డుపై దొరికిన వెండి పట్టిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగింత



ఎస్ఐకు పట్టిని అందజేస్తున్న కరాటే చిన్నారులు

లింగాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వెండి వస్తువును పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి తమ నిజాయితీని చాటుకున్నారు. కరాటే నేర్చుకుంటున్న చిన్నారి విద్యార్థులు లింగాలలో ముఖేష్ కరాటే అకాడమీలో కరాటే శిక్షణ పొందుతున్న కార్తీక్, కార్తికేయ, దిలీప్‌లు రోజు మాదిరిగానే సోమవారం ఉదయం కరాటే తరగతులకు వెళ్తున్నప్పుడు గ్రంథాలయం దాటిన తర్వాత పోస్టాఫీసు సమీపంలో ఒక వెండి కాళ్ల పట్టి దొరికింది. తమకు దొరికిన అట్టి కాళ్లపట్టిని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఎస్ఐ వెంకటేశ్‌గౌడ్‌కు అప్పగించి శభాష్ అన్పించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ కాళ్లపట్టిని పోగొట్టుకున్న బాధితులు తగిన ఆధారాలతో రెండవ కాళ్లపట్టిని తీసుకుని పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

డ్రగ్స్‌రహిత సమాజం కోసం బైక్ యాత్ర



బైక్ యాత్ర చేపట్టిన రాజకొండ ప్రభాకర్

చారకొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమాజంలో గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం రాష్ట్ర వ్యాప్త జన చైతన్య బైక్ యాత్ర చేపట్టినట్లు సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ తెలిపారు. ఆయన చేపట్టిన బైక్ యాత్ర సోమవారం చారకొండకు చేరుకుంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ మత్తు రహిత సమాజం కోసం ఈనెల 21న సూర్యపేట జిల్లా కేంద్రం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు.

గంజాయి,డ్రగ్స్ మాదకద్రవ్యాలను ప్రభుత్వం నిర్మూలించాలని అన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడితే కుటుంబాలు రోడ్డున పడుతాయని అన్నారు. డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా ఈనెల 21 నుంచి వివిధ జిల్లాలను పర్యటించి దాదాపుగా 1400ల కిలోమీటర్లు ప్రయణించి గంజాయి, డ్రగ్స్ మహమ్మారి నుంచి బయట పడాలని ప్రజలను చైతన్య వంతం చేసినట్లు అన్నారు. తెలంగాణాలోని అన్ని జిల్లాల్లో పర్యటించి డ్రగ్స్ గంజాయి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తానని చెప్పారు. చారకొండ మండల కేంద్రం నుంచి రంగారెడ్డి జిల్లా మాడ్గుల వైపు తన బైక్ యాత్ర కొనసాగించాడు.

ప్రజావాణి అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

» కలెక్టర్ బదావత్ సంతోష్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజల సమస్యలను పట్టించుకోవడంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో ఆయన సోమవారం స్వయంగా ప్రజల నుంచి దరఖాస్తుల ను స్వీకరించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖలు తక్షణమే పరిశీలించి వాటిని సత్వరంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నేటి ప్రజావాణిలో ప్రజలు వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై మొత్తం 51ఫిర్యాదులు సమర్పించారు. కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, విభాగాల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ప్రజావాణికి 6 ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్ క్రైం, (ఆంధ్రజ్యోతి) : పోలీస్ ప్రజావాణికి సోమవారం 6ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్ అన్నారు. భూ తగాదాలు-4, తగు న్యాయం గురించి-2 ఫిర్యాదులు అందినట్లు ఫిర్యాదుదారులతో ఆయన స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్



చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

చారకొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) సీఎంఆర్ఎఫ్ పథకం పేదలకు వరం లాంటిదని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 19 మంది బాధితులకు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి నాయిని జైపాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రంగినేని శ్రీపతిరావు, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గోరేటి శివ, మండల మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ సత్తార్, జేసీబీ వెంకటయ్యగౌడ్, సహదేవ్, మండల కాంగ్రెస్ యూత్ ఉపాధ్యక్షుడు పెద్దాపురం జగన్, యాదయ్య, రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

డైలీవేజ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, డైలీ వేజ్ వర్కర్లు

» సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న డైలీవేజ్ వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో డైలీ వేజ్ వర్కర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగికి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో డైలీ వేజ్ వర్కర్లు 18 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాల్లో పని చేస్తున్న డైలీ వేజ్ వర్కర్లకు దాదాపు 8 నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతుంటే.. ప్రభుత్వం వారి వేతనాలను తగిస్తూ జీవో 64ను తీసుకురావడం దుర్మార్గమన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శంకర్ నాయక్, డైలీ వైజ్ వర్కర్స్ యూనియన్ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్, నాయకులు భరత్, పద్మ, అంజమ్మ, యాదమ్మ, బాలమణి, బాలమ్మ పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ సంబురాలు

ఉప్పునుంతల/కోడేరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్య బృందం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా వైద్య సిబ్బంది వివిధ రకాల పూలతో బతుకమ్మ అలంకరణ చేసి బతుకమ్మ ఆడి పాడారు. వైద్యాధికారి స్వప్న, ఎంపీహెచ్‌వో మధునాయక్, ఉఫత్, ప్రభావతి, కుమారచారి, ఆశాలు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

● కోడేరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది ముందుగా రకరకాల పూలతో బతుకమ్మలు అలంకరించి మహిళలు బొడ్డెమ్మలతో పాటలు పాడి ఆట పాటలతో సంబురాలు నిర్వహించారు. డాక్టర్ అనిల్, సీహెచ్ఓ సుదర్శన్, ఫార్మసీ ఆఫీసర్ దిలీప్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ నారాయణ, ఎంఎల్‌పీహెచ్ శ్రీనివాస్, సురేష్, రఘు పాల్గొన్నారు.

పత్తి రైతులను ఆదుకోవాలి

కల్వకుర్తి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అధిక వర్షాల వలన భారీగా నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుక బాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్వకుర్తి మండల పరిధిలోని గుండూరు గ్రామంలో అధిక వర్షాల వలన నీటిలో మునిగిపోయిన పత్తి పంటను రైతు సంఘం జిల్లా కమిటీ పరిశీలించింది.

రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు జి.కృష్ణారెడ్డి, గుండూరు గ్రామ పత్తి రైతులు రవి, జంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బి.కృష్ణయ్య, రైతులు పాల్గొన్నారు.